
# ఇన్‌చార్జిలతోనే పాలన

- పలు కీలక స్థానాల్లో అధికారులకు అదనపు బాధ్యతలు
- నాలుగు నెలలుగా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ) పోస్టు ఖాళీ
- సెలవుపై వెళ్లిన డీఆర్వో, డీపీవో.. ఓ కేసులో ఆర్డీవో అరెస్టు
- మూడు బాధ్యతల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)
- స్థానిక సంస్థల్లో కొరబడిన పర్యవేక్షణ... పేరుకపోతున్న సమస్యలు



వరంగల్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా ఈ సమావేశంలో ప్రజాపాలన, ధరణి సమస్యలు, వానకాలం వ్యవసాయం, ప్రజారోగ్యం- సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతిభద్రతలు, డ్రగ్స్ నియంత్రణపై చర్చించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కీలకమైన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జిల్లాలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీ), జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో), జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా ఎక్సైజ్ అధికారి, వరంగల్ ఆర్డీవో, నర్సంపేట డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) వంటి పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేరు. ఈ పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ అంశాలపై పర్యవేక్షణ కొరవడి పాలన కుంటుపడుతోంది. స్థానిక సంస్థలను పటిష్టం చేయాలనే ఉద్దేశ్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా స్థానిక సంస్థల పర్యవేక్షణ బాధ్యతలను ఒక అదనపు కలెక్టర్‌కు అప్పగించింది. ప్రతి జిల్లాలో విధులు నిర్వర్తించే ఇద్దరు అదనపు కలెక్టర్లలో ఒకరు రెవెన్యూతో పాటు ఇతర శాఖలను, మరొకరు స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలను పర్యవేక్షిస్తున్నారు. వరంగల్ జిల్లాలో నాలుగు నెలల నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన అశ్విని తానాజీ వాకడే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో ఈ బాధ్యతలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణికి ప్రభుత్వం అప్పగించింది. అశ్విని తానాజీ వాకడే బదిలీ కావటానికి ముందే గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి 2న ముగిసి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. పర్యవేక్షణ కొరవడటం వల్ల పంచాయతీల్లో పాలన పడకేసిందనే ఆరోపణలొస్తున్నాయి. ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం ఎంపీటీసీల పదవీకాలం ఈ నెల 4న, జడ్పీటీసీల పదవీకాలం 5న ముగిసింది. దీంతో మండల ప్రజాపరిషతుల్లో కూడా ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. జిల్లా ప్రజాపరిషత్‌కు కలెక్టర్, ఆయా మండల ప్రజాపరిషత్‌లకు ఒక జిల్లా స్థాయి అధికారి స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. జడ్పీని పక్కన పెడితే మండల ప్రజాపరిషతుల్లో ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సంధ్యారాణిపై పని భారం పెరిగింది. డీఆర్వోగా పనిచేసిన శ్రీనివాసరావు ఇటీవల సెలవుపై వెళ్లారు. దీంతో సంధ్యారాణి డీఆర్వోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ సంధ్యారాణి మూడు పాత్రలను పోషిస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల పర్యవేక్షణపై ఆమె ఎక్కువ ఫోకస్ పెట్టలేకపోతున్నారనే భావన ప్రజల్లో ఏర్పడింది. జిల్లా ఎక్సైజ్ అధికారిగా పనిచేసిన లక్ష్మానాయక్ కొద్దినెలల క్రితం బదిలీ కాగా, ప్రభుత్వం ఏఈఎస్ మురళీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.


**సెలవుపై డీపీవో**

డీపీవో కల్పన జూన్ మొదటి వారంలో సెలవుపై వెళ్లడంతో జడ్పీ సీఈవో రాంరెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పల్లెల్లో పారిశుధ్య సమస్య తలెత్తుతుంది. వన మహోత్సవ కార్యక్రమం కొనసాగుతోంది. ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీనికి తోడు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో రెగ్యులర్ డీపీవో లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. డీపీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాంరెడ్డి జడ్పీ సీఈవో విధులకే అధిక సమయం కేటాయించాల్సి వస్తోంది. అంతేకాకుండా నర్సంపేట రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి రెగ్యులర్ డీఎల్‌పీవో కూడా మూడు నెలల నుంచి లేరు. వరంగల్ డీఎల్‌పీవో ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇదే నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) లేకపోవడంతో నర్సంపేట ఎంపీవో అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**ఆర్డీవో కూడా ఇన్‌చార్జే**

వరంగల్ ఆర్డీవోగా పనిచేసిన సిడాం దత్తును ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. దీంతో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణికి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా ప్రభుత్వం జాతీయ రహదారుల కోసం భూసేకరణపై దృష్టి పెట్టింది. దీనికితోడు వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి భూనిర్వాసితులకు కొందరికి ప్లాట్లను అందజేయడానికి, మామునూరు ఎయిర్‌పోర్టు కోసం, వరంగల్ నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం భూమిని సేకరించాల్సి ఉంది. అలాగే వరంగల్ ఆర్డీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణవేణికి ఇక్కడ డిజిటల్ సైన్ కేటాయించే అవకాశం లేకపోవటంతో పలు ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆగస్టు 15లోగా ధరణి సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ తరుణంలో వరంగల్ ఆర్డీవో పరిధిలో ధరణి సమస్యలు పరిష్కరించే అవకాశం లేకపోవటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. జిల్లాలో నెలకొన్న ఇన్‌చార్జి అధికారుల వ్యవహారం, సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి రూరల్, జూలై 19: హత్య కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సంపత్‌రావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ ఆదేశాలతో ఎస్సై ప్రసాద్, సిబ్బంది భూపాలపల్లి 5-ఇంక్లైన్ ఆర్చ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలోని ముగ్గురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకుని విచారించారు. దీంతో వారు పర్వతగిరి మండలం తురకల గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ (38), బానోత్ సిద్ధు(20), బానోత్ శీను(20) గా తెలిపారు. వీరు 23 ఏప్రిల్ 2024 తేదీన గొల్లబుద్ధారం తండాలో పెళ్లి సంబంధం ఉందని వర్ధన్నపేటలోని రాంధాన్ తండాకు చెందిన గుగులోత్ ప్రభాకర్(29)ను తీసుకువచ్చి రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం సేవించి అతని తలపై బండరాయితో కొట్టి చంపారు. అనంతరం వెంట తెచ్చుకున్న పెట్రోల్ అతనిపై పోసి నిప్పంటించి పారిపోయామని ఒప్పుకున్నారు. ఎందుకు చంపారని ప్రశ్నించగా ప్రభాకర్ అతని చెల్లెకు ఇవ్వాల్సిన 20 గుంటల భూమి ఇవ్వకుండా తల్లిదండ్రులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ, కొడుతూ చంపుతానని బెదిరించేవాడని చెప్పారు. దీంతో ప్రభాకర్ తండ్రి నరసింహ స్వామి తన కొడుకును చంపేందుకు రూ. 50 వేలు ఇస్తానని, ఎలాగైనా చంపమని తన బావమరిది బానోత్ బాలాజీకి చెప్పాడు. దీంతో బాలాజీ, ఆయన కొడుకు సిద్ధు, తమ్ముడి కొడుకు శీను పథకం ప్రకారం పెళ్లి సంబంధం చూసేది ఉందని గుగులోత్ ప్రభాకర్‌ను రాంపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకువచ్చి మద్యం తాగించి చంపి పెట్రోల్ పోసి కాల్చామని ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ పంపించామని డీఎస్పీ తెలిపారు. భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


# ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఎన్‌కౌంటర్

**ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి**

ములుగు, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఎలిమిడి పోలీస్‌స్టేషన్ పరిధి సిమలదొడ్డి గ్రామ సమీప అటవీప్రాంతంలో 20మంది మావోయిస్టులు కాల్పులు జరిపారన్నారు. ఈ క్రమంలో కాల్పులు ఆపి లొంగిపోవాలని పోలీసులు విజ్ఞప్తి చేసినప్పటికీ వారు కాల్పులు జరుపుతుండగా ఆత్మ రక్షణ కోసం పోలీస్ పార్టీ 15నిమిషాల పాటు ఎదురు కాల్పులు జరిపిందన్నారు. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందాడని చెప్పారు. సంఘటన స్థలం నుంచి 9ఎంఎం కార్బన్ తుపాకీ, మందు గుండు సామగ్రి, డిటోనేటర్, కిట్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కాల్పుల సంఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఎలిమిడి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినందున అక్కడ ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు.

# ఫోన్ లిఫ్ట్.. బైక్ బ్లాస్ట్

- పెట్రోల్ ట్యాంక్ నుంచి మంటలు
- తృటిలో తప్పించుకున్న భార్యాభర్తలు



మంటల్లో కాలిపోతున్న బైక్



బాధితుడు ఉమ్మగాని వెంకన్న

ఇనుగుర్తి, జూలై 19 : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయిన ఘటన శుక్రవారం ఇనుగుర్తి మండలంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. కోమటిపల్లికి చెందిన ఉమ్మగాని వెంకన్న దంపతులు బజాజ్ ఎక్స్‌సీడీ-125సీసీ బైక్‌పై కేసముద్రం బయల్దేరారు. మార్గమధ్యలోని జమ్ల తండా సమీపంలో విద్యుత్ 132కేవీ టవర్ లైన్ కిందకు చేరుకోగానే సెల్‌ఫోన్ మోగడంతో లిఫ్ట్ చేశాడు. దీంతో ఒక్కసారిగా బైక్ పెట్రోల్‌ట్యాంక్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో ఇద్దరు దిగి బైక్ వదిలేసి పరుగులు తీశారు. మంటలు చెలరేగడంతో పెద్ద శబ్దాలతో బైక్ పూర్తిగా కాలిపోయింది. ఓవైపు వర్షం కురుస్తుండగా బైక్‌లో మంటలు చెలరేగి కాలిపోవడం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. హెచ్‌టీ లైన్ కింద సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందా అని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

# పనిమనిషే దొంగ



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

- భారీ మొత్తంలో గోల్డ్ చోరీ
- నిందితుడు అరెస్టు.. 700 గ్రాముల బంగారం స్వాధీనం

సుబేదారి, జూలై 19 : పనిలో పెట్టుకున్న యజమానికి వర్కర్ కుచ్చుటోపీ పెట్టాడు. భారీ మొత్తంలో బంగారం చోరీకి పాల్పడ్డాడు. యజమాని ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రూ.52లక్షల విలువైన 700 గ్రాముల గోల్డ్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర సాంగ్లీ జిల్లా భాగ్యనగర్‌కు చెందిన సురేశ్ లక్ష్మణ్‌బాద్ జల్సాలకు అలవాటు పడి చోరీలు చేసేవాడు. వరంగల్ నగరంలోని విశ్వకర్మ కాలనీలో పరిచయం ఉన్న వ్యక్తి ద్వారా బంగారం కరిగించే వ్యాపారం నిర్వహిస్తున్న సంజ య్ వద్ద మే నెలలో పని లో చేరాడు. సురేశ్ లక్ష్మణ్‌బాద్ నమ్మకం మెలగడంతో యజమాని సంజయ్ షాప్ తాళాలు ఇచ్చాడు. దీన్ని అదనుగా తీసుకొని నిందితుడు జూన్ 14న షాప్‌లో సీసీ కెమరాలను ఆఫ్ చేసి 800 గ్రాముల బంగారం చోరీ చేసి పారిపోయాడు. యజమాని ఫిర్యాదుతో వరంగల్ సీసీఎస్, మట్టెవాడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు విజయవాడలో గోల్డ్‌ను విక్రయించడానికి సికింద్రాబాద్ నుంచి రైలులో ప్రయాణిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో నిఘా పెట్టి గురువారం ఉదయం వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద సురేశ్ లక్ష్మణ్‌బాద్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 700 గ్రాముల గోల్డ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా వంద గ్రాముల బంగారాన్ని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని సీపీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు అబ్బయ్య, గోపి, ఎస్సై విఠల్, సిబ్బందిని సీపీ అభినందించారు.

# కాంగ్రెస్‌లో వర్గపోరు బట్టబయలు

**సోషల్ మీడియాలో పరస్పర దూషణలు**

కాళేశ్వరం, జూలై 19: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బట్టబయలైంది. శుక్రవారం రెండు వర్గాలకు చెందిన వారు సోషల్ మీడియాలో పరస్పర దూషణలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, రైతులకు రుణ మాఫీ సందర్భంగా గురువారం కాళేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అయితే ఈ కార్యక్రమానికి తమను ఎందుకు పిలవలేదంటూ అదే పార్టీలోని ఒక వర్గం శుక్రవారం సామాజిక మాధ్యమం వేదికగా ప్రశ్నించింది. దీనితో స్థానిక సీనియర్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా, ఇరువర్గాలను సమన్వయపర్చాలని సూచించినట్లు తెలిసింది. ఒకరికొకరు పోటాపోటీగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకోవడంతో స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీనితో సీనియర్ నాయకులు జోక్యం చేసుకొని త్వరలోనే నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# పంచాయతీ సిబ్బంది భిక్షాటన



పర్వతగిరిలో భిక్షాటన చేస్తున్న జీపీ సిబ్బంది

పర్వతగిరి, జూలై 19: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామ పంచాయితీల సిబ్బంది శుక్రవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలకేంద్రం లో సామూహిక భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగుల కమిటీ మండల అధ్యక్షుడు నకిరకంటి రాంచందర్ మాట్లాడుతూ జీవో 51ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేసి నిరసన తెలిపినట్లు చెప్పారు. సంఘం ఉపాధ్యక్షులు వడ్డె కుమార్, ఈదుల వెంకన్న, చీదురు రజిని, బాబు, సురేశ్, మహేందర్, నరుకుడు వెంకట సోమయ్య, పద్మ, శ్రీకాంత్, పి.మహేందర్, చంద్రకళ, మౌనిక పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర

- తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్ కీలకపాత్ర పోషించిందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల్ అన్నారు. 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలలో నాబార్డ్ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇంక్యూబేషన్ సెంటర్‌లతో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ..నాబార్డు ప్రోత్సాహంతో పంటలపైన కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫిషరీస్ తదితర రంగాలద్వారా కూడా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తలసరి ఆదాయంలో 10వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకిందన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌సీఏబీ అధ్యక్షుడు ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ గ్రాస్ రూట్ స్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

# కార్పొరేట్లకు ఆ చాన్స్ ఇవ్వం

*బ్యాంక్ ప్రమోటర్లుగా అనుమతిపై ఆర్బీ ఐ గవర్నర్ దాస్*

ముంబై, జూలై 19: బ్యాంకుల ప్రమోటర్లుగా కార్పొరేట్లను అనుమతించే యోచనేదీ ప్రస్తుతానికి లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకే పైవిధంగా బదులిచ్చారు. వ్యాపార సంస్థలు బ్యాంకులను ఏర్పాటుచేస్తే బ్యాంకింగ్ ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. నిజానికి దశాబ్దకాలం కిందట బ్యాంకులకు లైసెన్సులిచ్చినప్పుడు కార్పొరేట్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. అయినప్పటికీ వారందరి దరఖాస్తులను ఆర్బీఐ తిరస్కరించింది. 2020లోనూ ఈ అంశం మళ్లీ తెరపైకి రాగా.. బ్యాంకులు అంటే ఇతర వ్యాపారాల మాదిరి కాదని ఆర్బీఐ తేల్చిచెప్పింది.

**డిపాజిట్లు తగ్గితే ఇబ్బందే**

రుణాల కంటే డిపాజిట్ల వృద్ధి తక్కువగా ఉంటే.. నిర్మాణాత్మక ద్రవ్యపరమైన సమస్యలు వస్తాయని దాస్ అన్నారు. వ్యక్తిగత రుణాల వంటి అన్‌సెక్యూర్డ్ లోన్లు పెరుగుతూ పోతుండటంపైనా ఆయన ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. రుణ, డిపాజిట్ల వృద్ధి మధ్య సహేతుకమైన సమతూకాన్ని పాటించాలని బ్యాంకులకు సూచించారు. డిపాజిట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు.

**ద్రవ్యోల్బణంపై..**

ద్రవ్యోల్బణంపై ఆర్బీఐ అనుసరించే ద్రవ్యవిధానం స్పష్టంగా ఉందని దాస్ చెప్పారు. గతకొంత కాలంగా వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిల్లోనే ఉంటుండటంపై స్పందిస్తూ.. అధిక వడ్డీరేట్లు దేశ జీడీపీ ప్రగతికి విఘాతం కలిగించడం లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ వృద్ధిరేటు 7.2 శాతంగా ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే ఆర్బీఐ ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తగ్గించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న మానిటరీ పాలసీ కమిటీ సభ్యుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం.

**ఛీర్‌లీడర్ కాదు..**

తన హయాంలో కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐని ఓ ఛీర్‌లీడర్‌గా ఎవరూ భావించలేదని దాస్ చెప్పారు. ఆ రకమైన భావన తనకు ఎప్పుడూ ఎదురు కాలేదన్నారు. ఈ క్రమంలోనే దేశ ఆర్థిక వ్యవస్థ కరోనా మహమ్మారి సృష్టించిన విధ్వంసం నుంచి త్వరగా బయటపడటానికి కేంద్ర ప్రభుత్వంతో ఆర్బీఐకి ఉన్న చక్కని సమన్వయం దోహదం చేసిందని తెలిపారు. దాదాపు ఆరేండ్ల తన పదవీకాలంలో ప్రభుత్వంతో సత్సంబంధాలనే నిర్వహించినట్టు వెల్లడించారు. కాగా, పలు కీలక అంశాల్లో కేంద్రంతో ఏర్పడిన విభేధాల కారణంగా ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్‌ను మోదీ సర్కారు తెచ్చిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి కేంద్రం చెప్పినదానికి ఆర్బీఐ ఊ కొడుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి విదితమే. పెద్ద ఎత్తున డివిడెండ్లనూ ఇస్తున్నది చూస్తూనే ఉన్నాం.

# స్టాక్ మార్కెట్లకు మైక్రోసాఫ్ట్ దెబ్బ





సెన్సెక్స్ 739, నిఫ్టీ 270 పాయింట్లు పతనం

ముంబై, జూలై 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. రికార్డు స్థాయి గరిష్ఠాల్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ పరిణామం భారతీయ మార్కెట్ల నష్టాలను మరింత పెంచింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 738.81 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 81 వేల మార్కుకు దిగువన 80,604.65 వద్ద ముగిసింది. నిజానికి తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ సాగింది. ఒకానొక దశలో గురువారం ముగింపుతో చూస్తే 244 పాయింట్లకుపైగా ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ 81,587.76 వద్దకు సూచీ వెళ్లింది. అయితే ఈ ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేకపోయింది. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోవడంతో 844.36 పాయింట్ల నష్టాన్ని సెన్సెక్స్ మూటగట్టుకోవడం గమనార్హం. చివరకు కొంతమేర కోలుకున్నా.. నష్టతీవ్రత ఎక్కువగానే ఉన్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 269.95 పాయింట్లు లేదా 1.09 శాతం దిగజారి 24,530.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మునుపెన్నడూ లేనివిధంగా 24,854.80 స్థాయికి చేరినా.. నిలదొక్కుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే 292.7 పాయింట్ల మేర నష్టపోయింది. అయితే ఆఖర్లో కాస్త కోలుకున్నది. అంతకుముందు 4 రోజుల పాటు స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే కదలాడిన విషయం తెలిసిందే. సెన్సెక్స్ 1,446.12 పాయింట్లు లేదా 1.80 శాతం పుంజుకున్నది.

## 8 లక్షల కోట్ల సంపద ఆవిరి

*స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లదాకా ఆవిరైపోయింది. రూ.7,94,059.53 కోట్లు క్షీణించి రూ.4,46,38,826.75 కోట్ల (5.34 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. వరుస లాభాల మధ్య మదుపరుల సంపద రూ.455 లక్షల కోట్లనూ తాకిన సంగతి విదితమే.*

**రంగాలవారీగా..**

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 4.11 శాతం పడిపోయాయి. కమోడిటీస్ 3.07 శాతం, చమురు-గ్యాస్ 2.87 శాతం, విద్యుత్తు 2.67 శాతం, ఆటో 2.53 శాతం, యుటిలిటీస్ 2.51 శాతం, రియల్టీ 2.44 శాతం, సేవలు 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా దిగజారింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.

**గ్లోబల్ మార్కెట్లలో..**

మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య.. అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీంతో ఆయా దేశాల స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది. ఆసియా దేశాల్లో ప్రధానంగా దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టాలను చవిచూశాయి. చైనా సూచీ లాభపడింది. అలాగే కీలక ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సూచీలూ నష్టపోయాయి. గురువారం నష్టాల్లో ముగిసిన అమెరికా మార్కెట్లూ.. శుక్రవారం తీవ్ర ఒడిదొడుకుల్లో ట్రేడ్ అయ్యాయి. మైక్రోసాఫ్ట్ దెబ్బకు విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్యాంకింగ్, మీడియా రంగాల్లోనూ ఇబ్బందులు తలెత్తాయి. కాగా, భారతీయ స్టాక్ మార్కెట్లపై సాంకేతికంగా మైక్రోసాఫ్ట్ ప్రభావం లేదని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ప్రకటించాయి.

# విప్రో లాభం 3 వేల కోట్లు

బెంగళూరు, జూలై 19: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,003.2 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 4.6 శాతం వృద్ధి కనబరిచినట్లు పేర్కొంది. కానీ, కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం తగ్గి రూ.21,963.8 కోట్లకు పరిమితమైంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పల్లె మాట్లాడుతూ..ఈ ఏడాది లాభాలతో ఆరంభించినట్లు, ముఖ్యంగా బిలియన్ డాలర్ల కంటే అతి విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ బీమా(బీఎఫ్ఎస్ఐ), కన్జ్యూమర్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

**ఏడాదిలోగా 12 వేల ఉద్యోగాలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 10-12 వేల మంది సిబ్బందిని క్యాంపస్‌లతోపాటు ఇతర మార్గాల ద్వారా నియమించుకునే ఆలోచనలో విప్రో ఉన్నది. తొలి త్రైమాసికంలో 337 మంది చేరడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,34,391కి చేరుకున్నారు.

# రిలయన్స్‌కు చమురు సెగ

- క్యూ1లో 5 శాతం తగ్గిన నికర లాభం





న్యూఢిల్లీ, జూలై 19: దేశంలో అత్యంత విలువైన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లాభాలకు చమురు సెగ గట్టిగానేతాకింది. రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉండటంతోపాటు పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది. టెలికం, రిటైల్ రంగాలు రాణించినప్పటికీ మిగతా రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. దీంతో గడిచిన త్రైమాసికానికిగాను కంపెనీ రూ. 15,138 కోట్లు(ప్రతి షేరుకు రూ. 22.37) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ. 16,011 కోట్లు(ప్రతిషేరుకు రూ.23.66) పోలిస్తే 5 శాతం తగ్గింది. జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.57 లక్షల కోట్లకు ఎగబాకింది.

**రిటైల్ ఆకర్షణీయం**

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ ఆకర్షణీయమైన లాభాలను ప్రకటించింది. జూన్ త్రైమాసికానికిగాను రూ.75,615 కోట్ల స్థూల ఆదాయంపై రూ.2,549 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.69,948 కోట్ల ఆదాయంతో పోలిస్తే 8.1 శాతం వృద్ధి నమోదుకాగా, రూ. 2,436 కోట్ల నికర లాభంతో పోలిస్తే 4.63 శాతం ఎగబాకింది. గత త్రైమాసికంలో కొత్తగా 331 రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభించతో మొత్తం సంఖ్య 18,918కి చేరుకున్నాయి.

*చమురు, గ్యాస్ వ్యాపారాలు బలహీనంగా ఉన్నప్పటికీ కన్స్యూమర్ విభాగాలు రాణించాయి. డిజిటల్ సర్వీసెస్, రిటైల్ రంగాలకు కస్టమర్ల నుంచి ఆశించిన స్థాయిలో కంటే అధికంగా మద్దతు ఉండటంతో ఈ విభాగాలను మరింత వేగవంతంగా విస్తరించనున్నాం.*

*- ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ*

- జియో కస్టమర్లు 48.18 కోట్ల నుంచి 48.97 కోట్లకు పెరిగాయి. సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై వచ్చే ఆదాయం రూ. 180.5 నుంచి రూ.181.7 పెరిగింది.
- తలసరి డాటా వినిమయం నెలకు 30.3 జీబీ లేదా రోజుకు జీబీ డాటా కంటే అధికంగా నమోదైంది.
- కంపెనీ రుణాలు రూ.1.16 లక్షల కోట్ల నుంచి రూ.1.12 లక్షల కోట్లకు తగ్గాయి.
- కేజీ బేసిన్‌లో రోజుకు 28.7 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

## జియో లాభం 5,445 కోట్లు

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో లాభాలతో కళకళలాడుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.5,445 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 12 శాతం ఎగబాకింది. వరుస త్రైమాసికాలతో పోలిస్తే 2 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.26,478 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది.

## వాణిజ్య

# రూపాయికి చిల్లులు

*7 పైసలు పడిపోయిన విలువ*

ముంబై, జూలై 19: రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. మరో 7 పైసలు తరిగిపోయి 83.70కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతోపాటు ఈక్విటీ మార్కెట్లు డీలా పడటం కరెన్సీ పతనానికి ప్రధాన కారణమని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమనడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగిందని, ఆర్బీఐ జోక్యం చేసుకున్నప్పటికీ పతనం మాత్రం ఆగలేదు. 83.64 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 83.60 గరిష్ఠ స్థాయికి చేరుకోగా, 83.70 కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు 7 పైసలు తగ్గి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు అయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరిస్తుండటం, రూపాయి పతనానికి అడ్డుకట్ట వేయడానికి ఆర్బీఐ చర్యలు తీసుకుంటేనే తిరిగి కోలుకునే అవకాశాలున్నాయని చెప్పారు. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 83.40-83.90 స్థాయిలో ఉండనున్నట్లు తెలిపారు.

# టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 19(నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలను పెంపొందించడానికి, స్టార్టప్ కార్యకలాపాల పురోగతి సాధించడానికి ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. యువత ఆలోచనలను వ్యాపార నమూనాగా రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, మార్గనిర్దేశం ఇచ్చేలా రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని తెలిపారు.

# పేటీఎం నష్టం 840 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 19: రిజర్వు బ్యాంక్ దెబ్బతో ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పేటీఎం మరో షాక్ తగిలింది. జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో కంపెనీకి రూ.840 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన తర్వాత ఇంతటి భారీ స్థాయిలో నష్టాన్ని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.358.4 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది.